

సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 17 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 267 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.25

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టంగా రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.9°/24.1°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఉక్కపోత కొనసాగుతోంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో వాయువ్య దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు

- అధికారులకు మంత్రి సవిత హెచ్చరిక



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ: విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై వేటు తప్పదని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత హెచ్చరించారు. శుక్రవారం ఆమె పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పెనుకొండ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసి గ్రామ స్వరాజ్యం తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారని, ఇందుకు అధికారుల సహాయ సహకారాలు అవసరమన్నారు. ప్రతి అధికారి పరస్పరం సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి బాసటగా నిలవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం ఉండే వారు ఎవరైనా సహించే ప్రసక్తే లేదన్నారు. ఏదైనా సమావేశం ఏర్పాటు చేసినప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా సమయపాలన పాటించాలన్నారు. సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం ఆమె... శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్, హౌసింగ్, రెవెన్యూ, శానిటేషన్, రక్షిత మంచినీరు, ప్రజారోగ్యం తదితర సమస్యలపై చర్చించారు.

'విజన్ డాక్యుమెంట్'కు నివేదికలు సిద్ధం చేయాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం 'విజన్–2047'పై దృష్టి సారించినందున అందుకు అవసరమైన వంద రోజుల విజన్ డాక్యుమెంట్లను అన్ని శాఖలు సిద్ధం చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో అన్ని శాఖల ముఖ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అట్టడుగు స్థాయి వ్యక్తుల జీవితాలు మార్చేలా ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు సిద్ధం అయ్యిందన్నారు. అధికారులు మండల, కుటుంబ స్థాయి వరకూ ఒక యూనిట్‌గా పరిగణించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. విజన్ 100 రోజుల డాక్యుమెంట్‌కు అన్ని శాఖలు సహకారం అందించాలన్నారు. 2024 నుంచి 2029 వరకూ ఆయా శాఖల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కొండయ్య, సీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ మంజువాణి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఈఓ మీనాక్షి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సంజీవయ్య, డీపీఓ విజయ్‌కుమార్, విద్యాశాఖ అధికారి జయచంద్ర, వ్యవసాయాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీలు నివారించాలి

- పోలీసులకు ఎస్పీ రత్న ఆదేశం



వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ, ఎస్‌ఐలతో సమావేశమైన ఎస్పీ రత్న

హిందూపురం: రాత్రి వేళల్లో గస్తీ మరింత పెంచి చోరీలను పూర్తిగా నివారించాలని ఎస్పీ రత్న సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆమె హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిసెప్షన్ కౌంటర్, రికార్డుల నిర్వహణ, లాకప్ గదులతో పాటు పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం వద్దని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆమె పట్టణంలోని సీఐలు, ఎస్‌ఐలతో సమావేశమయ్యారు. రాత్రి వేళ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. డివిజన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు.

పీస్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలి

చవితి వేడుకలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో హిందూపురం ప్రాంతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్పీ వివరించారు. మంటపాల నిర్వాహకులంతా తప్పనిసరిగా నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. ఇందుకు పీస్ కమిటీలతో సమావేశాలతో నిర్వహించాలన్నారు. డీఎస్పీ కంజాక్షన్‌ను రిలీవ్ చేసి పెనుకొండ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు.

వరాలివ్వు తల్లీ

శ్రావణ మాసం రెండో శుక్రవారం జిల్లాలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇంటింటా వరలక్ష్మి వ్రతాలు ఘనంగా జరిగాయి. ఇళ్లకు మంగళతోరణాలు కట్టి శ్రావణ లక్ష్మిని సాదరంగా ఆహ్వానించిన మహిళలు... అమ్మవారి విగ్రహాలను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, జాకెట్లు అందించారు. ఇక ఆలయాల్లో జరిగిన సామూహిక వ్రతాల్లో భారీగా పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పలు విద్యాసంస్థల్లోనూ విద్యార్థినులు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వరాలివ్వు తల్లీ వరలక్ష్మీ అంటూ వేడుకున్నారు. – సాక్షి బృందం



రొళ్ల మండలం రత్నగిరిలో లక్ష్మీదేవి రూపంలో దర్శనమిచ్చిన కాళికాంబ



హిందూపురం చైతన్యనగర్‌లోని ఓ ఇంట్లో కొలువైన వరలక్ష్మీదేవి



హిందూపురం కొల్హాపురి లక్ష్మీదేవి ఆలయంలో సహస్ర లక్ష్మీదేవి వ్రతం ఆచరిస్తున్న మహిళలు

హన్నన్నా.. దోచేశారన్నా!

పేదలకు తక్కువ ధరకే భోజనం పెడతామంటూ హడావుడి చేశారు. క్యాంటీన్ తెరవకముందే నిధులు భోంచేశారు. గోడలకు రంగులద్ది రూ.లక్షలు బొక్కేశారు. పైపై మెరుగులతో మాయ చేశారు. అడ్డగోలు పనులతో అందిన కాడికి దోచేశారు. అందుకే జనం.. హన్నన్నా... తమ్ముళ్ల మేసేందుకే 'అన్నా' క్యాంటీన్ పనులా అనుకుంటున్నారు.

- 'అన్నా క్యాంటీన్ల'కు రూ.లక్షల్లో కేటాయింపు
- ఏడు క్యాంటీన్ల మరమ్మతులకు రూ.43 లక్షలు
- మున్సిపాలిటీ నిధులను కేటాయించిన పాలకులు
- పెనుకొండలో సొంత నిధులు వెచ్చిస్తోన్న మంత్రి
- మిగతా ప్రాంతాల్లో కూటమి నేతల ఆధ్వర్యంలో పనులు
- పైపై మెరుగులతో భారీగా భోంచేసిన 'తమ్ముళ్లు'

సాక్షి, పుట్టపర్తి 'అన్నా క్యాంటీన్ల'కు మరమ్మతులంటూ కూటమి నేతలు రూ.లక్షలు కొల్లగొట్టారు. తమకు అనుకూలంగా ఉన్న వారికే కాంట్రాక్టులు ఇచ్చి మున్సిపాలిటీ నిధులను ఎడాపెడా వాడేశారు. గతంలోనే నిర్మించిన భవనాలకే మరమ్మతులు చేస్తున్నట్లు ప్రచారం ఊదరగొట్టారు. ఎవరికి వారు నిధులు మేసేశారు.

హడావుడి పనులు

జిల్లాలో మడకశిర, పుట్టపర్తి, కదిరిలో ఒక్కొక్కటి, హిందూపురం, ధర్మవరంలో రెండు చొప్పున మొత్తం ఏడు అన్నా క్యాంటీన్లు ఉన్నాయి. ఇవన్నీ గతంలోనే నిర్మించారు. ప్రస్తుతం అన్ని భవనాలు బాగానే ఉన్నాయి. ఈనెల 15వ తేదీ నాటికి వాటిని పునఃప్రారంభించాలని కూటమి ప్రభుత్వం భావించింది. వాస్తవానికి భవనాలకు రంగులు వేసి.. చిన్న చిన్న రిపేరీలు చేస్తే సరిపోతుంది.. కానీ కూటమి నేతలు ప్రభుత్వ సొమ్మును దిగమింగే కార్యక్రమంలో భాగంగా టెండర్లు పిలిచారు. అంచనాలు నాలుగురెట్లు పెంచి నిధులు విడుదల చేయించుకున్నారు. తమవారికే కాంట్రాక్టులు కట్టబెట్టి పైపై మెరుగులద్దారు. మంజూరైన నిధుల్లో నాలుగోవంతు ఖర్చు చేసి మిగతా సొమ్ములు భోంచేశారు.

ఎక్కడా రూ.లక్ష ఖర్చు కనిపించదాయె!

జిల్లాలోని ఏడు అన్నా క్యాంటీన్ల మరమ్మతులను పరిశీలిస్తే.. ఎక్కడా కనీసం రూ.లక్ష ఖర్చు చేసినట్లు కనిపించడం లేదు. కానీ కాంట్రాక్టర్లు మాత్రం రూ.2.5 లక్షల నుంచి రూ.11 లక్షల వరకు టెండర్లు పాడారు. ఏ అన్నా క్యాంటీన్ పరిశీలించినా.. రంగులు వేయడం తప్ప వేరే పని చేసిన దాఖలాలు లేవు. కొత్త హంగులు దిద్దే క్రమంలో రంగు రంగుల లైట్లు తగిలించి.. వెలుగులు నింపారు. ధర్మవరం పట్టణంలో ఎల్‌పీ సర్కిల్, ప్రభుత్వాస్పత్రి వద్ద మరో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఈ రెండింటి మరమ్మతుల కోసం ప్రభుత్వం ఏకంగా రూ.20 లక్షలు మంజూరు చేసింది. కానీ రెండింటికీ కలిపి రూ.5 లక్షలు మించి ఖర్చు చేయలేదని తెలుస్తోంది. టెండర్లలో పేర్కొన్న పనుల్లో ఏ ఒక్కటీ చేయకపోయినా అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇంత మాత్రం పనులకు రూ.లక్షలు ఎలా ఖర్చయ్యాయంటూ ప్రజలే ప్రశ్నిస్తున్నారు.



ఇది మడకశిరలోని అన్నా క్యాంటీన్. ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు, మరమ్మతులకు రూ.3.5 లక్షలు కలిపి మొత్తం రూ.8.5 లక్షలు కేటాయించారు. భవనం ముందు గ్రీల్ ఏర్పాటు చేశారు. పెయింటింగ్ చేసి భారీగా మెక్కేసినట్లు స్థానికులే చర్చించుకుంటున్నారు.



ఇది కదిరిలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్. అప్పటికే నిర్మించిన ఈ భవన మరమ్మతుల కోసం ఏకంగా రూ.4.5 లక్షలు కేటాయించారు. పెయింటింగ్ పనులతో మెరిపించి నిధులు మెక్కేశారు.



ఇది పుట్టపర్తిలోని అన్నా క్యాంటీన్. మరమ్మతుల పేరిట ప్రభుత్వం రూ.2.5 లక్షలు మంజూరు చేయగా.. పైపై పనులతో మమ అనిపించారు. ఈ పనుల్లో రూ. 1.50 లక్షలు మింగేసినట్లు స్థానికులు చెబుతున్నారు.



ఇది హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని అన్నా క్యాంటీన్. భవనం రిపేరీ కోసం రూ.4 లక్షలు కేటాయించారు. పనులు చూస్తే రూ.లక్షకు మించి వ్యయం చేసినట్లు కనిపించడం లేదు. అలాగే 25వ వార్డులో మరో అన్నా క్యాంటీన్ మరమ్మతులకు రూ.3.5 లక్షలు మంజూరు కాగా, పనులు నామమాత్రంగా చేసినట్లు తెలుస్తోంది.

11 మంది కౌన్సిలర్ల సస్పెన్షన్

- గీతదాటిన వారిపై వైఎస్సార్ సీపీ వేటు

సాక్షి, పుట్టపర్తి మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా విజయం సాధించి గురువారం టీడీపీలో చేరిన 11 మంది హిందూపురం మున్సిపల్ కౌన్సిలర్లపై ఆ పార్టీ అధిష్టానం వేటు వేసింది. పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లతో పాటు మరో ముగ్గురు కార్యకర్తలను సస్పెండ్ చేసినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బి.నవీన్‌నిశ్చల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సస్పెండ్ అయిన వారు ఇలా...

సస్పెండ్ అయిన కౌన్సిలర్లలో డీఎస్ ఇంద్రజ (19వ వార్డు), నసీరా బాను (7వ వార్డు), గిరీశ్ కుమార్ (8వ వార్డు), షేక్ రమహత్‌బీ (12వ వార్డు), సునీత (13వ వార్డు), పరుశురామ్ (20వ వార్డు), ఆయుబ్ (23వ వార్డు), నాగేంద్రమ్మ (27వ వార్డు), మల్లికార్జున (28వ వార్డు), రేష్మాబాను (32వ వార్డు), నాగమణి (34వ వార్డు) ఉన్నారు. వీరితో పాటు కార్యకర్తలు షఫీ (కింగ్–సి), వెంకటరెడ్డి, బాబు (కిరోసిన్) పై కూడా సస్పెన్షన్ వేటు వేశారు.

దమ్ముంటే రాజీనామా చేయండి

ఒక పార్టీలో గెలిచి.. మరో పార్టీలో చేరడం 'పాలు తాగిన.. రొమ్మును గుద్దడమే' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ అన్నారు. రాజకీయంగా గొప్ప అవకాశం ఇచ్చి.. ప్రజాప్రతినిధులను చేసి.. చిన్న వయసులోనే అత్యున్నత బాధ్యతలు అప్పజెప్పిన పార్టీకి నమ్మక ద్రోహం చేసి డబ్బులకు అమ్ముడుపోవడం వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. దేవుడి వంటి వైఎస్ జగన్‌ను మోసగించి.. టీడీపీలో చేరడం సబబు కాదన్నారు. టీడీపీలో ఏనాడూ కులాల వారీగా న్యాయం జరగలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఓ పార్టీలో గెలిచి.. మరో పార్టీలో చేరేవారు.. తమ పదవులకు రాజీనామా చేయాలని నవీన్‌నిశ్చల్ సవాల్ విసిరారు. దమ్ముంటే.. ఉప ఎన్నికలకు వెళ్లి పోటీ చేయాలన్నారు. ఏనాడూ మున్సిపల్ కార్యాలయం మెట్లు కూడా ఎక్కని వారికి.. రాజ్యాధికారం కట్టబెడితే.. పార్టీ మారి.. వారి రాజకీయ భవిష్యత్ నాశనానికి పునాదులు వేసుకున్నారన్నారు. ఓ పార్టీలో గెలిచిన వారిని.. రాజీనామా చేయకుండానే తమ పార్టీలోకి ఆహ్వానించిన స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణకు రాజకీయ పార్టీల నిబంధనలు తెలియవా? అని నవీన్‌నిశ్చల్ ప్రశ్నించారు. పార్టీలు మారే వారిని సహించేది లేదన్నారు.

24 గంటలూ వైద్యసేవలందాలి



హిందూపురం జిల్లా ఆస్పత్రి పరిసరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- హిందూపురం జిల్లా ఆస్పత్రి వైద్యులకు కలెక్టర్ చేతన్ ఆదేశం
- ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచన
- 'సాక్షి' కథనంపై వివరాలు ఆరా...
- అందుబాటులో లేని సూపరింటెండెంట్‌పై ఆగ్రహం

హిందూపురం టౌన్: జిల్లా ఆస్పత్రిలో 24 గంటలూ వైద్యసేవలు అందాలని, ఇందుకు సిబ్బంది నిరంతరం విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వైద్యులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య సేవలు, ఆస్పత్రిలోని సౌకర్యాల గురించి సంబంధిత వైద్యాధికారులను ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, కంప్యూటర్ ఓపీ స్లిప్పులు అందజేయాలని ఆదేశించారు. అవసరమైన సాంకేతిక పరికరాలు, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆయన పార్కింగ్ ఏరియాను, డీఈఐసీ బిల్డింగ్, స్టాఫ్ క్వార్టర్స్, ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్ రూము, డయాలసిస్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో వార్డుల్లో సైన్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ డేవిడ్ రాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఓబులమ్మ తదితరులు ఉన్నారు.

'సాక్షి' కథనంపై వివరణకు ఆదేశాలు

'నిరీక్షిస్తేనే వైద్యం!' శీర్షికన హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలపై ఈనెల 15వ తేదీన 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై కలెక్టర్ చేతన్ స్పందించారు. వివరణ ఇవ్వాలని జిల్లా వైద్యాశాఖాధికారులకు ఆదేశించినట్లుగా తెలిసింది. దీంతో జిల్లా వైద్యాధికారులు ఇదే విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు తెలిపి వివరణ కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించి, వివరాలను ఆరా తీశారు. ఎమర్జెన్సీలో మెరుగైన సేవలు అందాలన్నారు. అలాగే వైద్య సేవలు పొందేందుకు, మందులు తీసుకునేందుకు ఎందుకు నిరీక్షించాల్సి వస్తుందంటూ ఆరా తీశారు. కాగా, ఆస్పత్రి తనిఖీ సమయంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పుట్టపర్తి వచ్చి తనను కలవాలని కలెక్టర్ ఆదేశించారు.

తమ్ముళ్ల 'నామినేటెడ్' లొల్లి

- మడకశిరలో పట్టుకోసం ఈరన్న, గుండుమల వర్గాల ఆధిపత్య పోరు
- కేబినెట్ ర్యాంకు పోస్టు కోసం ఇద్దరు నేతల పోటాపోటీ
- అనుచర వర్గానికీ పోస్టులు ఇప్పించుకునేలా ప్లాన్
- నామినేటెడ్ పదవులపై రెండు వర్గాల్లో టెన్షన్



మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మడకశిరలో తెలుగు తమ్ముళ్ల ఆధిపత్య పోరు ఎక్కువైంది. ఎన్నికల వేళ మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడికి టీడీపీ అధిష్టానం తొలుత టికెట్ కేటాయించగా, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చక్రం తిప్పి చివరి నిమిషంలో స్థానికేతరుడైన ఎంఎస్ రాజుకు టికెట్ ఇప్పించారు. అప్పటి నుంచే ఈ రెండు వర్గాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. తాజాగా 'నామినేటెడ్' పోస్టుల వ్యవహారంలో రెండు వర్గాలు అధిష్టానంతో అమీతుమీకి సిద్ధమయ్యాయి. ఈనెలలోనే మొదటి విడత నామినేటెడ్ పోస్టుల భర్తీకి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రచారం సాగుతుండగా, ఈరన్న, గుండుమల వర్గాలు విజయవాడలో మకాం వేసి పోస్టుల కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి.

అతనికి మాత్రం ఇవ్వొద్దు

నామినేటెడ్ పోస్టుల కోసం ఎవరికి వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్న ఈరన్న, గుండుమల తిప్పేస్వామి టీడీపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ఒకదశలో తమకు పోస్టు ఇవ్వలేని పక్షంలో అతనికీ పోస్టు ఇవ్వకూడదంటూ అటు ఈరన్న, ఇటు గుండుమల తిప్పేస్వామి కీలక నేతలను కోరినట్లు తెలుస్తోంది.

ఎవరి ధీమా వారిది

నామినేటెడ్ పదవులపై మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఎవరికి వారు భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఈనెల 1న సామాజిక పింఛన్ల పంపిణీకి ముఖ్యమంత్రి చంద్రబాబు గుండుమల తిప్పేస్వామి స్వగ్రామం గుండుమలకు రాగా, తిప్పేస్వామి అన్నీ తానై వ్యవహరించారు. పార్టీ ఇన్‌చార్జ్‌గా మడకశిర అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేశానని, పార్టీ అధికారంలో లేనప్పుడు కూడా కార్యకర్తలకు అండగా ఉన్నానని అందువల్ల పదవి తనకే వస్తుందని మాజీ ఎమ్మెల్సీ గుండుమల ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎన్నికల వేళ టికెట్ త్యాగం చేశామని, తప్పకుండా తన త్యాగాన్ని హైకమాండ్ గుర్తించి నామినేటెడ్ పోస్టు ఇవ్వడం ఖాయమని ఈరన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులున్న వారికే పదవులు దక్కుతాయని అంతా భావిస్తున్నారు. చంద్రబాబు ఆశీస్సులు గుండుమలకా... ఈరన్నకా...అన్న విషయం త్వరలో తేలనుంది.

పోటీలో మేము సైతం

నామినేటెడ్ పోస్టుల కోసం టీడీపీలోని రెండు వర్గాలు పోటీ పడుతుంటే...కొత్తగా ఎమ్మెల్యే రాజు వర్గం కూడా తయారయ్యింది. ఇక ఇదే అదనుగా బీజేపీ, జనసేన నాయకులు కూడా పదవుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే మడకశిర నియోజకవర్గంలో బీజేపీ, జనసేన బలం అంతంత మాత్రమే. అందువల్ల ఆ పార్టీల నేతలకు పదవులు దక్కే ఛాన్స్ లేదని అందరూ భావిస్తున్నారు. మొత్తమ్మీద నామినేటెడ్ పోస్టుల ప్రకటన టీడీపీలో ముసలం రేపింది.

కేవలం : ₹ 2,520/-తో (చివరి అవకాశం)
GOVT. COMPUTER & CRAFT COURSES
* Office Automation * Beautician * Yoga
ONLINE దరఖాస్తులకు చివరి రోజు : 17-8-2024
Public Exam Date : 01-10-2024
ఈ సర్టిఫికేట్స్ అన్ని Govt.ఉద్యోగాలకు ఉపయోగపడును.
SAI INSTITUTION
14/402, Kamala Nagar, ATP.
Y. Obi Reddy, Cell: 9059722829

క్లుప్తంగా

బొలెరో బోల్తా... బాలుడికి గాయాలు


తీవ్రంగా గాయపడిన దామోదర్

తనకల్లు: బొలెరో బోల్తాపడిన ఘటనలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు... నల్లచెరువు మండలం ఓరువాయి గ్రామానికి చెందిన ఎల్లప్ప తన కుమారుడు దామోదర్‌తో కలసి శుక్రవారం ఉదయం టమాట పంటను విక్రయించేందుకు బొలెరో వాహనంలో అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు బయలుదేరాడు. తనకల్లు మండలం గంగసానివారిపల్లి సమీపంలోకి చేరుకోగానే టైర్ పేలడంతో టైరు పంచర్ కావడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పల్లంలోకి పల్టీ కొట్టింది. వాహనంలో కూర్చొని ఉన్న దామోదర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు క్షతగాత్రుడిని తమ ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జూదరుల అరెస్ట్

రొళ్ల: మండలంలోని రంగనపల్లి పొలిమేరలో శుక్రవారం సాయంత్రం జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.7,100 స్వాధీనం చేసుకుని, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

18న జిల్లా స్థాయి యోగా పోటీలు

కనగానపల్లి: ఈ నెల 18న హిందూపురం వేదికగా జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు యోగా స్పోర్ట్స్ కమిటీ జిల్లా కార్యదర్శి, కనగానపల్లి అంకె సుబ్బరాయుడు శుక్రవారం తెలిపారు. హిందూపురంలో యోగా థెరపీ కళాశాలలో జిల్లా యోగా స్పోర్ట్స్ కమిటీ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. బాల, బాలికలను ప్రత్యేక విభాగాలు విభజించి, ఐదు అంశాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తారన్నారు.

గోవిందురాజులపల్లిలో చోరీ

ఎన్పీకుంట: మండలంలోని గోవిందురాజులపల్లిలో పట్టపగలే చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన కె.కొండారెడ్డి... మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఆయన పనికి వెళ్లడంతో భార్య శాంతమ్మ ఇంటికి తాళం వేసి వ్యవసాయ కూలి పనులకు వెళ్లింది. మధ్యాహ్నం 3 గంటలకు భోజనానికని కొండారెడ్డి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే తాళం బద్దలుగొట్టి విషయం గుర్తించిన ఆయన లోపలకు వెళ్లి పరిశీలించాడు. బీరువాలో దాచిన ఐదు తులాల బంగారు నగలు, రెండు జతల వెండి గొలుసులు, రూ.30వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి, ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సిలాట్‌కు సెల్యూట్

- నూతన క్రీడపై జిల్లా యువత ఆసక్తి
- ఆహ్లాదంతో పాటు స్వీయరక్షణ
- నృత్యం సమ్మిళితమైన యుద్ధకళ


రాష్ట్రస్థాయి సిలాట్ పోటీలో తలపడుతున్న మధుర

హిందూపురం: పెంకాక్ సిలాట్.... జిల్లాలోని యువతను, చిన్నారులను ప్రస్తుతం ఉర్రూతలూగిస్తున్న క్రీడ ఇది. శాస్త్రీయ, ఆధునిక నృత్యాల సమ్మిళితమైన ఈ యుద్ధకళ చూపరులకు వినోదాన్ని పంచడంతో పాటు గుర్తింపునూ కలిగిస్తోంది. ఇంతటి విశిష్టమైన క్రీడలో హిందూపురానికి చెందిన బాలబాలికలు రాణిస్తున్నారు.

త్రేతాయుగం నాటిదే...

ప్రత్యర్థి చేతికి అందకుండా శరవేగంగా తప్పించుకుని స్ట్రైకింగ్.. గ్రాప్లింగ్ నైపుణ్యాలతో పోరాటం సాగించడం సిలాట్ క్రీడాకారుడి ప్రత్యేకత. ఈ క్రీడ ఇప్పటి కాదని శిక్షకులు అంటున్నారు. త్రేతాయుగంలో వాలి, సుగ్రీవుడి మధ్య సాగిన పోరాట విధానాలను అభివృద్ధి చేసి ప్రస్తుత తరానికి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఇండోనేషియాలో విశేష ప్రాచుర్యమున్న ఈ క్రీడకు ఇప్పుడిప్పుడే దేశీయంగా ఆదరణ కనిపిస్తోంది. ఇప్పటికే దక్షిణ ఆసియా దేశాల్లో విశేష ఆదరణ పొందిన ఈ క్రీడను నెల్లూరుకు చెందిన పురిమిట్ల మనోజ్‌సాయి ఏపీకి పరిచయం చేయగా, ఆయన ద్వారా జిల్లాలో హిందూపురానికి చెందిన జనార్దన రెడ్డి సిలాట్ క్రీడాభివృద్ధికి బీజమేశారు.

ఆకట్టుకునే విన్యాసాలు

పెంకాక్ సిలాట్‌లో క్రీడాకారుడు ప్రదర్శించే విన్యాసాలు దాదాపు శాస్త్రీయ, ఆధునిక నృత్యాలను యుద్ధకళతో సమ్మిళితం చేసినట్లుగా కనిపిస్తుంది. కరాటేలోని స్ట్రైకింగ్ వేగం... కుంగుఫూలోని త్రోయింగ్... జూడోలోని పట్లతో కూడిన ఈ క్రీడలో శరీరంలోని ప్రతి భాగాన్ని ఉపయోగించాల్సి ఉంటుంది. దీంతో క్రీడాకారుడు నిరంతర అప్రమత్తంగా ఉండేలా దోహదపడుతుంది. కరాటే, కుంగుఫూ తదితర క్రీడల్లో ఉన్నట్లుగానే ఈ క్రీడలోనూ ప్రధానంగా ఆరు విభాగాలను క్రీడాకారులు అభ్యసించాల్సి ఉంటుంది. ప్రధానంగా రెగు, తుంగల్, గండ, సోలో, ఆర్టిస్టిక్, టాండింగ్ వంటి విన్యాసాల్లో ప్రావీణ్యం కనబరిస్తే ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయి. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి.


సిలాట్ పోటీల్లో సాధించిన పతకాలు చూపుతున్న చిన్నారులు


రాష్ట్రస్థాయి సిలాట్ పోటీలో తలపడుతున్న తన్వీతరెడ్డి


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మదిహ


సిలాట్ కటాస్ చూపుతున్న నస్రీన్


రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన శరణ్య

జిల్లాలో రాణిస్తున్న బాలబాలికలు

జిల్లాలో ఇటీవల సిలాట్ క్రీడపై హిందూపురం ప్రాంత యువతులు, బాలబాలికలు మక్కువ పెంచుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ కోచ్‌లు రఫీక్ అహమ్మద్, జనార్దన్‌రెడ్డి, రియాజ్, బాబా ఫకృద్దీన్ 2015 నుంచి సిలాట్ క్రీడపై ఇక్కడి విద్యార్థులు, ఆసక్తి ఉన్న యువతకు శిక్షణ ఇస్తున్నారు. అంతేకాక రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయి పోటీల్లో తలపడేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయి, సౌత్ జోన్ స్థాయిలో జరిగిన పోటీల్లో హిందూపురానికి చెందిన మధుర, తన్వీతరెడ్డి, మీన రాణించారు. ఒంగోలు, నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలు సీనియర్ విభాగంలో నస్రీన్, శరణ్య, మదిహ విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. కేరళలోని తిరువనంతపురం, పాండిచ్చేరిలో జరిగిన సౌత్‌జోన్ మీట్‌లోనూ పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. త్వరలో జమ్ములో జరిగే జాతీయ స్థాయి పోటీల్లోనూ తమ ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడమే లక్ష్యమని వారు పేర్కొంటున్నారు.

ఆసక్తి పెంపొందించుకోవాలి



చాలా మందికి సిలాట్‌లోని ప్రత్యేకత తెలియక ఆసక్తి కనబరచడం లేదు. వాస్తవానికి ఈ క్రీడకు అంతర్జాతీయంగా ఎంతో ఆదరణ ఉంది. ఒలంపిక్ క్రీడల్లోనూ చేర్చేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా బాలకల స్వీయరక్షణకు ఈ క్రీడ ఎంతో ఉపయుక్తం. జిల్లాలో మరింతగా ఈ క్రీడను వ్యాప్తి చేయాలని ప్రయత్నిస్తున్నాం.

– జనార్ధన్‌రెడ్డి, సిలాట్ శిక్షకుడు, హిందూపురం

15 ఏళ్ల బాలిక హస్తలాఘవం

- మహిళను ఏమార్చి నగలు, నగదు అపహరణ

పామిడి: పట్టుమని 15 ఏళ్లు కూడా లేని ఓ బాలిక తన హస్తలాఘవాన్ని ప్రదర్శించింది. మహిళను ఏమార్చి నగలు, నగదు అపహరించుకెళ్లింది. ఈ ఘటన పామిడిలోని యూనియన్ బ్యాంక్ శాఖలో చోటు చేసుకోవడం గమనార్హం. వివరాలు... పామిడిలోని విద్యుత్ శాఖ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న ఆచారీ యంత్ర పరికరం కొనుగోలుకు హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పామిడిలోని తన భార్య వరలక్ష్మికి ఫోన్ చేసి డబ్బు తక్కువ పడిందని, వెంటనే సర్దుబాటు చేయాలని తెలిపాడు. దీంతో ఆమె తన వద్ద ఉన్న 1.5 తులం బంగారు నగను తాకట్టు పెట్టి రుణం తీసుకోవడంతో ఇంట్లో ఉన్న రూ.5,600ను భర్తకు పంపాలని నిశ్చయించుకుని ఓ ప్లాస్టిక్ కవర్‌లో ఉంచుకుని యూనియన్ బ్యాంక్ శాఖకు చేరుకుంది. ఈ క్రమంలో బ్యాంక్‌లో ఆమె లావాదేవీలు చూసుకుని బంగారు నగ తీసి ఇచ్చేందుకు కవర్‌ను చేతిలోకి తీసుకోగానే అది ఖాళీగా కనిపించింది. అందులో ఉన్న నగతో పాటు నగదు కనిపించలేదు. సమాచారం అందించడంతో సీఐ రాజశేఖరరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. బ్యాంక్‌లోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. బ్యాంక్‌లో ప్రవేశించినప్పటి నుంచి ఓ బాలిక (సుమారు 15 సంవత్సరాల వయస్సు) ఆమె చుట్టూ తిరుగుతూ ఉన్నట్లు గమనించారు. వరలక్ష్మి నగ తాకట్టు విషయంగా మాట్లాడుతున్న సమయంలో ఆమెకు తెలియకుండా ప్లాస్టిక్ కవర్‌ను బ్లేడ్‌తో కోసి నగతో పాటు నగదూ అపహరించుకెళ్లిన దృశ్యాలు గమనించి, పుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్యూఆర్ కోడ్‌తో రైలు టికెట్

గుంతకల్లు: గుంతకల్లు డివిజన్‌లోని అన్ని రైల్వేస్టేషన్లలో క్యూఆర్ కోడ్ సదుపాయంతో టికెట్లు కొనుగోలు చేయవచ్చునని సీనియర్ డీసీఎం మనోజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫోన్‌పే, గూగుల్‌పేలోని క్యూఆర్ కోడ్ సదుపాయం తొలుత ప్రధాన రైల్వేస్టేషన్లలో మాత్రమే అమలు చేశామని, ప్రస్తుతం అన్ని స్టేషన్లలోనూ అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.

అంతర్రాష్ట్ర మహిళా దొంగల అరెస్ట్

బత్తలపల్లి: ఒంటరి మహిళలను ఏమార్చి వారి వద్ద ఉన్న విలువైన వస్తువులు అపహరించుకెళ్లే అంతర్రాష్ట్ర మహిళా దొంగలు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన రాధమ్మ తన భర్త మోహనయ్యతో కలసి బత్తలపల్లి మండలం యర్రాయపల్లిలోని బంధువుల ఇంటికి కొన్ని రోజుల క్రితం వచ్చింది. తిరుగు ప్రయాణంలో భర్త ముందుగా వెళ్లిపోయాడు. అనంతరం ఈ నెల 12న రాధమ్మ ఒక్కతే బస్సు ఎక్కి స్వగ్రామానికి బయలుదేరింది. బత్తలపల్లిలో ఆమెను అనుసరిస్తూ బస్సు ఎక్కిన ఆగంతకులు ఆమె బ్యాగ్‌లో ఉన్న బంగారు నగలను అపహరించారు. విషయాన్ని గుర్తించిన బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం ఉదయం బత్తలపల్లి సమీపంలోని ఓ ధాబా వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ సమయంలో రాధమ్మ బంగారు నగల అపహరణకు పాల్పడింది తామేనని వారు అంగీకరించారు. పట్టుబడిన వారిని తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా సిప్‌కాట్‌కు చెందిన వెంకటేష్ కుమార్తె కలయ్‌వాణి అలియాస్ కళ్యాణి, వెంకట్రామన్ భార్య వి.రేఖ, తిరువన్నామలై జిల్లా కట్టమడువు గ్రామానికి చెందిన శివ భార్య గాజుల భారతిగా గుర్తించారు. వీరి నుంచి ఏడు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ముగ్గురూ జల్సాలకు అలవాటు పడి తమ అవసరాలు తీర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది. ప్రయాణికుల దృష్టిని ఏమార్చడంతో పాటు మత్తు మందు ప్రయోగించి చోరీలు సాగిస్తున్నట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

'జూడా'ల ఆందోళన ఉధృతం

- అత్యవసర సేవలకు దూరంగా జూనియర్ డాక్టర్లు
- జూనియర్ డాక్టర్ల సమ్మెకు ఐఎంఏ, ఏఎస్‌ఐ మద్దతు
- మొత్తం 430 మంది వైద్యులు, హౌస్‌సర్జన్లు విధులకు దూరం
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన బోధనాస్పత్రి అధికారులు


నిరసన తెలుపుతున్న జూడాలు, హౌస్ సర్జన్లు

అనంతపురం మెడికల్: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యను నిరసిస్తూ బోధనాస్పత్రి (జీఎంసీ)లో జూడాలు ఆందోళన ఉధృతం చేశారు. శుక్రవారం జూడా, హౌస్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో నిరవధిక నిరసనలు మొదలుపెట్టారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో జీజీహెచ్ ఎదుట గంటకుపైగా మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. జీఎంసీలో 300 మంది పీజీలు, 131 మంది హౌస్‌సర్జన్లు విధులకు దూరంగా ఉంటున్నట్లు జూడా అధ్యక్షుడు హరికిరణ్ తెలిపారు.

ప్రత్యామ్నాయ చర్యలకు నిర్ణయం..

జూడాలు, వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో జీఎంసీ ప్రిన్సిపాల్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హెచ్‌ఓడీలు సమావేశమయ్యారు. రోగులకు అసౌకర్యం కల్గకుండా 29 సర్వీస్ పీజీలు, అరుగురు సీనియర్ రెసిడెంట్లు, ప్రైవేట్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఫిజియోథెరపిస్టులతో సేవలందించాలని నిర్ణయించారు. వీలైతే ఐఎంఏ వైద్యుల సహకారం తీసుకోవాలని తీర్మానించారు.

రోగుల అవస్థలు..

జీజీహెచ్‌లో జూడాలు సమ్మెలోకి వెళ్లడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. జీజీహెచ్ ఉన్నతాధికారులు కేవలం ఎమర్జెన్సీ సేవలపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. శుక్రవారం గైనిక్, అత్యవసర విభాగం, ఏఎంసీ తదితర విభాగాల్లో వైద్యులు కన్పించారు. స్టాఫ్‌నర్సులే ఇంజెక్షన్లు వేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

నేడు 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేత

జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మెకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, అభిషేక్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నగరంలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీడీ సేవలు, అత్యవసరం కాని శస్త్రచికిత్స పూర్తిస్థాయిలో నిలిపివేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు వైద్య సేవల ఉపసంహరణకు మద్దతు తెల్పుతున్నట్లు అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ కే శివశంకర్ రావు, గౌరవ కార్యదర్శి డాక్టర్ ఫణిమహేష్‌రెడ్డి పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గార్లదిన్నె: ఐచర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. వివరాలను శుక్రవారం ఆమె వెల్లడించారు. అనంతపురానికి చెందిన టిప్పు సుల్తాన్, మహేష్ నాయక్... గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి గురువారం రాత్రి ఐచర్ వాహనంలో తరలిస్తూ కోటంక ఆంజనేయస్వామి ఆలయం వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులకు పట్టుబడ్డారు. వాహనంలో 28 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనానిని సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేశారు.



అలరించిన సంగీత కచేరీ

ప్రశాంతి నిలయం: చిరుప్రాయంలోనే ఫిమేల్ వయొలనిస్ట్‌గా గుర్తింపు పొందిన కృష్ణా జిల్లాకు చెందిన సత్యసాయి భక్తురాలు, సత్యసాయి బాలవికాస్ పూర్వ విద్యార్థిని అంబటిపూడి కామాక్షి శుక్రవారం సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన కచేరీ అలరించింది. పర్తి యాత్ర పేరుతో కృష్ణా జిల్లాకు చెందిన సుమారు 1,500 మంది సత్యసాయి భక్తులు పుట్టపర్తికి విచ్చేశారు. శుక్రవారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కామాక్షి వయొలిన్‌తో పలికించిన గమకాలతో భక్తులు పరవశించి పోయారు.


కచేరీ నిర్వహిస్తున్న అంబటిపూడి కామాక్షి

యువకుడి బలవన్మరణం


రంజిత్‌రెడ్డి (ఫైల్)

పరిగి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగిలోని సిద్దారెడ్డి కాలనీకి చెందిన రంజిత్‌రెడ్డి (25), తల్లి కృష్ణవేణి, తమ్ముడితో కలసి పదేళ్లుగా తండ్రికి దూరంగా నివాసముంటున్నారు. కియా అనుబంధ పరిశ్రమలో పని చేస్తుండే రంజిత్‌రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో విధులకు సక్రమంగా వెళ్లకుండా పని మానేసి, తన పెద్దమ్మ కుమారుడితో కలసి ఆయిల్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా చేరాడు. కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న ఆయన శుక్రవారం నొప్పి తీవ్రంత భరించలేక, జీవితంపై విరక్తితో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ జయలత అక్కడకు చేరుకుని పరిశీలించారు. కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభించినట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ వారు అర్హులు. ఆసక్తి ఉన్న యువతీయువకులు తమ ఆధార్ నకలుతో పాటు మొబైల్ నెంబర్ వివరాలు పేర్కొంటూ దరఖాస్తు చేసుకోవాలి. నాలుగు నెలల కాల వ్యవధికి సంబంధించి ఉచితంగా శిక్షణ ఇచ్చి, అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 93471 89696లో సంప్రదించవచ్చు.

ఒడిశా, ఢిల్లీ విజయం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం: ఆర్డీటీ క్రీడా గ్రామం వేదికగా జరుగుతున్న ఆల్ ఇండియా జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో శుక్రవారం ఒడిశా, ఢిల్లీ జట్లు విజయం సాధించాయి. ఉదయం ఒడిశా, మిజోరం మధ్య జరిగిన మ్యాచ్‌లో 11-0 గోల్స్ తేడాతో ఒడిశా జట్టు గెలుపొందింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ- ఛత్తీస్‌ఘడ్ జట్లు తలపడ్డాయి. 5-0 గోల్స్ తేడాతో ఢిల్లీ జట్టు గెలుపొందింది. మ్యాచ్‌లను అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీటీ ఫైనాన్స్ డైరెక్టర్ సంజీవ్ ప్రారంభించారు.

రూ.10 లక్షలు కాజేసిన మోసగాళ్లు

మోసపోయిన హైదరాబాద్ నివాసి

హిందూపురం అర్బన్: మేలిమి బంగారం ఆశ చూపి రూ.10 లక్షలు దండుకుని ఓ ముఠా ఉడాయించింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ అంశానికి సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... హైదరాబాద్‌కు చెందిన చంద్రశేఖర్ హిందూపురం నివాసి జబీ ద్వారా ఓ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు రెండు రోజుల క్రితం వచ్చి ఓ లాడ్జీలో బస చేశాడు. ఈ క్రమంలో ఆయనకు ఓ అగంతకుడు ఫోన్ చేసి, భూమి కొనడం వల్ల లాభం లేదని తమ వద్ద బంగారం ఉందని తక్కువ ధరకే ఇస్తామని నమ్మబలికాడు. వారి మాయలో చిక్కుకున్న చంద్రశేఖర్ గురువారం కారులో రైల్వేస్టేషన్ వద్దకు చేరుకున్నాడు. అప్పటికే అక్కడున్న ఇద్దరు వ్యక్తులు బంగారం చూపి నగదు తీసుకుని లెక్కిస్తున్నట్లుగా నడిస్తూ అక్కడి నుంచి ఉడాయించారు. ఘటనతో అవాక్కైన చంద్రశేఖర్ తన చేతిలో ఉన్న బంగారాన్ని పరిశీలించి, అది నకిలీదని గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి రాయితీలు

పుట్టపర్తి: జిల్లాలో పండ్ల తోటలు సాగు చేసే రైతులకు రాయితీలను అందజేస్తున్నట్లు ఉద్యానాధికారి నవీన్ తెలిపారు. మామిడి, చీనీ, దానిమ్మ, బొప్పాయి తదితర పండ్ల తోటల పెంపకం చేపట్టే రైతులతో పాటు పూలు, హైబ్రిడ్ కూరగాయల పెంపకానికి ప్రభుత్వం రాయితీలందిస్తోందన్నారు. తోటల సాగుకే కాక ఫారం పాండ్లు, ప్యాక్ హౌస్‌ల నిర్మాణాలకు, స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లకు రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు.

రాయితీల వివరాలు

తోటల రకం	హెక్టార్‌కు యూనిట్ విలువ	రాయితీ
మామిడి	రూ.32,250	రూ.13,300
చీనీ	రూ.41,888	రూ.16,004
దానిమ్మ	రూ.66,680	రూ.26,672
బొప్పాయి	రూ.61,655	రూ.24,662
జామ	రూ.73,300	రూ.29,331
నేరేడు	రూ.32,000	రూ.16,000
ఉసిరి	రూ.34,200	రూ.17,100
డ్రాగన్ ఫ్రూట్	రూ.34,200	రూ.17,100
అంజూర	రూ.50,750	రూ.20,300
చింత	రూ.14,687	రూ.7,339
సీతాఫలం	రూ.32,200	రూ.17,100
పూలు	రూ.40,000	రూ.16,000
హైబ్రిడ్ కూరగాయలు	రూ.50,000	రూ.20,000

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

■ ఓపెన్ టెన్త్ ఇంటర్ మరియు డిగ్రీ చేరాలి అనే విద్యార్థులకు డిస్టెన్స్ ద్వారా చదువుకొనుటకు అడ్మిషన్లు జరుగుతున్నవి. సంప్ర: 9182369298. [A-3448]

ఆఫీస్ ఆటోమేషన్ కోర్స్

■ కేవలం ఫీజు: 3750/- రాయితీతో దరఖాస్తులు. AP-SBTET ద్వారా పాస్ అయిన సర్టిఫికెట్ అన్ని Govt.జాబ్స్‌కు ఉపయోగపడును. Q:10th పాస్. అప్లికేషన్ లాస్ట్ డేట్: 17-08-2024. # సాయి ఇనిస్టిట్యూట్, కమలానగర్, ATP. 9059729829. [A-1314]

YOGA, CRAFT COURSES

■ కేవలం ఫీజు 3750/- రాయితీతో దరఖాస్తులు. అన్ని Govt. & ప్రైవేట్ జాబ్స్‌కు AP-SBTET ద్వారా పాస్ అయిన సర్టిఫికెట్ ఉపయోగపడును. Q : ఇంటర్ / డిప్లొమా లాస్ట్‌డేట్. 17-8-2024. # సాయి ఇనిస్టిట్యూట్, కమలానగర్, ATP. 9059729829. [A-1315]

GNM (నర్సింగ్) అడ్మిషన్స్

■ On-Line అప్లికేషన్స్ స్టార్ట్. ఇంటర్ ఏనీ గ్రూప్ పాస్ స్టూడెంట్స్ కి GNM (నర్సింగ్) కోర్స్ నందు గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర : G.మురళి, 9030661651 అనంతపురం. [A-1317]

REAL ESTATE

మీ పెట్టుబడికి - అధిక రాబడి

■ ATP బళ్ళారి రోడ్డుకి 3 సెంట్ల ప్లాట్లు తక్కువ రేట్లకు లభించును. వెంచర్ నందు తారు రోడ్లు, ఎలక్ట్రిసిటి లైన్స్, అన్ని డెవలప్‌మెంట్స్ తో కలిసి ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్, ఎయిర్ పోర్ట్ ప్రపోజల్ ఉన్న రిత్యా. తక్కువ టైమ్‌లో రాబడి అధికంగా పెరిగే అవకాశం కలదు. బుకింగ్స్ కై వెంటనే సంప్ర : షెక్షావలి 9396205666. [A-1313]

COMMERCIAL SPACE FOR RENT

■ కమర్షియల్ స్పేస్ గ్రౌండ్ ఫ్లోర్ 1350 చ.అ, 1వ ఫ్లోర్ : 1550 చ.అ, @ శ్రీకంఠం సర్కిల్, ATP. బ్యాంక్స్ / ఆఫీసులు / క్లీనిక్స్ / షోరూమ్స్ / ఇనిస్టిట్యూట్స్‌కి. 9440760122, 7780436121. [A-784651]

SERVICES

BUSINESS OFFER

■ మా లాభదాయక వ్యాపారంలో భాగస్వామి కావాలనుకుంటున్నారా? వెడ్డింగ్ హాల్ నిర్మాణం కోసం పెట్టుబడిదారులు కావాలి. 9441166484 నెంబర్‌కి సంప్రదించండి. [A-784664]

WANTED

■ ప్రముఖ కంపెనీలో అగ్రికల్చరల్ ఫీల్డ్ వర్క్ చేయుటకు ఫీల్డ్ ఎంప్లాయిస్ కావలెను. Q: Inter, Degree, B.Sc., Agriculture. Cell: 09441366774. [A-1316]

■ SMART BADI ఫోటోషాప్ మరియు వీడియో ఎడిటింగ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుచున్నవి. మరిన్ని వివరాలకు సంప్రదించండి. సెల్: 8686181839. [A-784665]

■ అనంతపురము, ప్రముఖ బ్యాంక్ నందు పనిచేయుటకు GUN MAN కావలెను. జీతం : 22K to 23K GUN ఉన్నవారు మాత్రమే. సంప్ర: 8309988784, 9440087632. [A-1318]

■ YIP PVT LTD recruits Male or Female Age 18 to 45, Qul: 10th to Any Degree, Salary 18000 and above work from home facility is available. 8121818692 [G-8994]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K, ఫోన్ : 9160900024, 9640400073 [H-796267]

■ అనంతపురములోని రియల్‌ఎస్టేట్ నందు పనిచేయుటకు మేనేజరు కమ్ అకౌంటెంట్ కావలెను. సంప్రదించండి సెల్: 8886238686. [A-347]

■ SBI లైఫ్ ఇన్సూరెన్స్ నందు అడ్వయిజర్స్ నియామకాలు జరుగుచున్నవి. నెలకు ఆదాయం 25వేలు + ఆ పైన, 10th పాసై, 25 సం: నిండిన వారు అర్హులు. 9849571330. [A-1319]

■ 10th పాసై, 27 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులకు SBI లైఫ్ ఇన్సూరెన్స్ నందు జీరో ఇన్వెస్ట్‌మెంట్‌తో, మంత్లీ మినిమం 30 వేలు పొందే అవకాశం. వెంటనే సంప్రదించండి: 9063791808. [A-1320]

■ అనంతపురము టౌన్‌లో ప్రముఖ కంప్యూటర్ షాప్ నందు పనిచేయుటకు స్టోర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం : 15,000/- పైన. సంప్ర : 9848784140, 7995297575, 9676625312. [A-6329]

■ ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు ATP లో పనిచేయుటకు అనుభవంగల డ్రైవర్ మరియు కిచెన్ సూపర్‌వైజర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్: 7780282377, 9153532929. [A-784668]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.